

రంజాన్ వేళలు | ఇఫ్తార్ (శుక్ర) సా.6.24 | సహరి (శని) ఉ.4.44

ద్వారంపూడికి చేదు అనుభవం
ఈఏపీసెట్ తేదీల మార్పు
» మే 16 నుంచి 22 వరకు నిర్వహణ

టార్గెట్.. పవన్



» పిఠాపురంలో జనసేన అధినేత పవన్ పోటీతో వైసీపీ వెన్నులో వణుకు
» ఎలాగైనా ఆయన్ను ఎన్నికల్లో ఓడించే లక్ష్యంతో వైసీపీ దుష్ట పన్నాగాలు
» ఎన్ని కోట్లయినా వెచ్చించి ఓట్లు కొనేందుకు వక్రమార్గాల్లో వ్యూహాలు
» నియోజకవర్గాన్ని మూడుగా విభజించి ముగ్గురు కీలక నేతలకు బాధ్యతల అప్పగింత
» ధన, కండబలం వినియోగించి ప్రతి వర్గాన్ని సంఘాన్ని కొనుగోలు చేసేలా ప్లాన్
» యు.కొత్తపల్లి దాడిశెట్టి రాజా, పిఠాపురం మిథున్‌రెడ్డి, గొల్లప్రోలుపై కన్నబాబు గురి
» ఎక్కడికక్కడ వీరంతా పవన్‌ను ఓడించడమే లక్ష్యంగా బేరసారాలు, కుయుక్తులు
» తాజాగా ఇంతకాలం దూరంపెట్టిన ఎమ్మెల్యే దొరబాబుకు సీఎం జగన్ పిలుపు
» పవన్‌ను ఓడించే టార్గెట్ అప్పగింత
» మరోపక్క త్వరలో రానున్న కడప బృందాలకు అద్దె ఇళ్లు కూడా సిద్ధం చేసిన వైసీపీ
» తనను ఓడించేందుకు వైసీపీ పన్నుతున్న పన్నాగంపై ఇప్పటికే పవన్ ధ్వజం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పిఠాపురంనుంచి జనసేన అధినేత పవన్ బరిలోకి దిగుతుండడంతో అప్పుడే వైసీపీ వెన్నులో వణుకుపుడుతోంది. రాజకీయంగా, సామాజికంగా బలము న్న ప్రాంతంలో పవన్ పోటీచేస్తుండడంతో తమ పార్టీకి పుట్టగతులుండవనే కలవరపాటుకు గురవుతోంది. పవన్ ప్రభావంతో పార్టీ తుడిచిపెట్టుకుపోతుందనే ఆందోళనతో బేజారెత్తుతోంది. ఈనేపథ్యంలో పవన్ లక్ష్యంగా వైసీపీ పావులు కదుపుతోంది. ఆయన్ను ఎలాగైనా ఓడించడమే ధ్యేయంగా కుట్రలు పన్నుతోంది. కోట్లు కుమ్మరించడం దగ్గరనుంచి ఓటర్లను అన్ని విధాలా దారికి తెచ్చుకునే వరకు రకరకాల పన్నాగాలు పన్నుతోంది. స్వయంగా రాష్ట్ర పార్టీ ముఖ్య నేత నియోజకవర్గంపై గురిపెట్టి పవన్ ఓటమికి వ్యూహాలు రచిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇందులోభాగంగా నియోజకవర్గాన్ని ఇప్పటికే వైసీపీ మూడు ముక్కలు చేసి ముగ్గురు కీలక నేతలకు అప్పగించింది. వీరి ద్వారా బేరసారాలు, ప్రలోభాలు అమలు చేయిస్తోంది. అటు సీటు చింపేసి కొంతకాలంగా పక్కన పెట్టిన ఎమ్మెల్యే దొరబాబును సైతం పవన్ ఓటమికి వాడుకునే స్కెచ్ వేసింది. రాష్ట్ర ముఖ్యనేత సామాజికవర్గానికి చెందిన ఇద్దరు కీలక నేతలు పవన్ ఓటమికి ఏపే ఎత్తులు వేయాలో జిల్లా కేంద్రంలో మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. త్వరలో ఇక్కడ పంపకాలకు వీలుగా కడప నుంచి బృందాలను సిద్ధం చేశారు. గృహసారథులు, గ్రామస్థాయి నేతలకు రూ.లక్షనుంచి రూ.10లక్షల వరకు ఖర్చులకు అందించేలా కోట్లలో కట్టలు సిద్ధం చేశారు. ఈ పన్నాగాల నేపథ్యంలో పవన్ వైసీపీపై ధ్వజమెత్తడంతో అధికారపార్టీ బరితెగింపుపై చర్చ జరుగుతోంది.

ఎంతకైనా తెగిద్దాం..

అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవడంతో అప్పుడే పిఠాపురం నియోజకవర్గం కేంద్రంగా రాజకీయాలు వేడెక్కాయి. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్వయంగా ఇక్కడినుంచి పోటీ చేస్తుండడంతో రాష్ట్రంలో అందరి దృష్టి ఇక్కడే నెలకొంది. అధికార వైసీపీ మాత్రం పవన్ పోటీతో వణికిపోతోంది. ఆయన ప్రభావంతో కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వైసీపీ ఎక్కడ నామరూపాల్లేకుండా పోతుందోనని కంగారెత్తుతోంది. ఈ నేపథ్యంలో పవన్‌ను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతో రకరకాల పావులు కదుపుతోంది. ఎన్ని కోట్లు ఖర్చయినా సరే పవన్‌ను నెగ్గకుండా చేయాలని వ్యూహాలు పన్నుతోంది. అందుకోసం అనేక అడ్డదారులు తొక్కుతోంది. వాస్తవానికి ఈ ఎన్నికల్లో పవన్ పిఠాపురం నుంచి పోటీచేస్తారనే అంచనాలతో కొన్నినెలలుగా వైసీపీ కుయుక్తులకు తెరతీసింది. దొంగ ఓట్లను నమోదు చేయించడం దగ్గరనుంచి అనుకూల ఆర్వోను నియమించుకోవడం వరకు పలు రకాల అక్రమాలకు పాల్పడింది. తీరా ఇప్పుడు పవన్ పోటీ ఖాయమవడంతో మరింత బరి తెగిస్తోంది. అందుకోసం అధికారం అండతో అడ్డగోలుగా సంపాదించిన డబ్బు ఎంతైనా వెచ్చించడానికి సిద్ధమవుతోంది. బూత్‌స్థాయినుంచి క్లస్టర్, గ్రామం, మండల స్థాయి వరకు పార్టీ గృహ సారథులు, మండల, గ్రామస్థాయి పార్టీ ముఖ్య నేతలకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు చేతికి అందించాలని నిర్ణయించింది. డబ్బు సొంతానికి వాడుకుంటూనే పవన్‌ను ఓడించేలా ఎక్కడికక్కడ పనిచేయాలని చెబుతోంది.

మూడు మండలాలకు ముగ్గురు..

నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసి మూడు మండలాలను ముగ్గురు కీలక నేతలకు అప్పగించింది. వీరంతా తమకు అప్పగించిన మండలాల్లో రూ.50కోట్ల వరకు అయినా వెచ్చించి బూత్‌స్థాయిలో ఓట్లు కొనడం దగ్గర నుంచి వివిధ కులాలు, సంఘాలతో బేరసారాలు జరిపే బాధ్యత అప్పగించింది. యు.కొత్తపల్లి మండలం బాధ్యతలు మంత్రి దాడిశెట్టి రాజా పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల ఆయన స్థానిక మత్స్యకార నేతలు, సంఘాలతో సంప్రదింపులు జరిపారు. డబ్బు ఎంతైనా వెదజల్లుతామని మండలంనుంచి ఒక్క ఓటూ పవన్‌కు పడకూడదని ఒత్తిడి తెచ్చారు. పిఠాపురం మండలం ఎంపీ మిథున్‌రెడ్డి, గొల్లప్రోలు మండలాన్ని ఎమ్మెల్యే కన్నబాబు పర్యవేక్షిస్తున్నారు. ఈ మూడు మండలాల్లో జనసేన ఓడేలా, వైసీపీ నెగ్గేలా ఎత్తుకు పై ఎత్తుల అమలు, పర్యవేక్షణ కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి, కొత్తగా పార్టీలో చేరిన ముద్రగడ పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో ఆయా మూడు మండలాల్లో కీలకనేతలకు ఆర్థికవనరులు, ఆహార సరఫరా తదితర వ్యవహారాలన్నీ ద్వారంపూడి పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.

ఇన్నాళ్లు దూరం పెట్టి..

పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు ఇటీవల జగన్ టికెట్ చింపేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తే ఓటమి పాలవుతారనే నెపంతో అసెంబ్లీ టికెట్ నిరాకరించారు. ఆయన స్థానంలో కాకినాడ ఎంపీ గీతను తీసుకువచ్చి పోటీ చేయిస్తున్నారు. దీంతో చేసేదిలేక దొరబాబు మౌనంగా ఉండిపోయారు. టీడీపీ, జనసేనలో టికెట్ అవకాశాలు లేకపోవడంతో అయిష్టంగానే వైసీపీలో కొనసాగుతున్నారు. పలుసార్లు జగన్‌ను కలిసినా హామీ ఏదీ ఇవ్వకుండా పక్కనపెట్టేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న తనను పక్కనపెట్టి గీత పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తుండడపై దొరబాబు కొన్నిరోజులుగా గుర్రుగా ఉన్నారు. దీంతో ఆయన ఒంటరిగా మిగిలారు. పిఠాపురంనుంచి పవన్ పోటీ చేస్తున్న నేపథ్యంలో ఇన్నాళ్లు దూరంపెట్టిన దొరబాబును వైసీపీ మళ్లీ దగ్గరకు చేర్చుకుంది. స్వయంగా సీఎం జగన్ తాడేపల్లికి పిలిపించుకున్నారు. పవన్ ఓటమికి కృషి చేయాలంటూ దిశానిర్దేశం చేశారు. ఇదే విషయాన్ని తాడేపల్లినుంచి బయటకు వచ్చిన తర్వాత దొరబాబు ప్రకటించారు. పవన్ ఓటమి లక్ష్యంగా పనిచేయాలని సీఎం చెప్పినట్లు పేర్కొనడం విశేషం.

ఆ టీంలు అందుకేనా..

పవన్‌ను ఓడించడం కోసం త్వరలో పిఠాపురానికి భారీగా కడప బృందాలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆయా బృందాలు ఇక్కడే ఉండి దొంగ ఓట్లు, డబ్బుల పంపకం వంటి పనులు చేయనున్నాయి. రాయలసీమకు చెందిన ఓ ఎంపీ కనుసన్నల్లో ఈ స్కెచ్ అమలవుతోంది. ఈ బృందాల కోసం ఇప్పటికే పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లో నాలుగు చొప్పున పెద్ద అద్దెఇళ్లు సిద్ధం చేశారు. ఆయా యజమానులకు అప్పుడే అడ్వాన్సులు కూడా చెల్లించారు. వంద కోట్లకు పైగా ఖర్చు చేసయినా పవన్‌ను ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్న అధికార పార్టీ నియోజకవర్గంల్లో బూత్‌లవారీగా లక్ష్యాలు విధించుకుంది. ఎమ్మెల్యే అభ్యర్థి గీత ప్రచారానికి వెళ్లి చేతులు జోడిస్తే చాలని మిగతాదంతా తాము చూసుకుంటామని ఆమెకు ఇటీవల పార్టీ పెద్దలు స్పష్టం చేశారు. కాగా తనను ఓడించడానికి వైసీపీ అవలంభిస్తున్న అడ్డదార్లను ఇటీవల పవన్ బయటపెట్టారు. తనను ఓడించేందుకు నియోజకవర్గంలో ఒక్కో కుటుంబానికి లక్ష ఇవ్వడానికి వైసీపీ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఎంపీ మిథున్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారంటూ మండిపడ్డారు.

పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబుకు
సీఎం జగన్ బుజ్జగింపులు

» కొంతకాలంగా అసంతృప్తితో పెండెం
» పిఠాపురం సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జగన్



సీఎం జగన్‌ను కలిసిన పిఠాపురం ఎమ్మెల్యే పెండెం

పిఠాపురం, మార్చి 21: పిఠాపురంనుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీతో ఇక్కడ సీటు గెలుపును సీఎం జగన్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కొంతకాలంగా టిక్కెట్ దక్కలేదని అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యే పెండెం దొరబాబును తన క్యాంపు కార్యాలయానికి గురువారం సాయంత్రం పిలిపించుకుని బుజ్జగించారు. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పెండెం దొరబాబును కాదని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్‌ను వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. అప్పటినుంచి ఎమ్మెల్యే దొరబాబు అసంతృప్తిగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. పుట్టినరోజు వేడుకలు వేదికగా భారీ బలప్రదర్శన చేశారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు మినహా మిగిలిన వాటికి దూరంగా ఉంటూనే వచ్చారు. ఇటీవల పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో సీఎం జగన్ స్వయంగా రంగంలోకి దిగారు. ఆసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యే దొరబాబును తనవద్దకు రావాలని సూచించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. దొరబాబును ఆయన బుజ్జగించారు. వంగాగీత గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. ఆమెను గెలిపించుకురావాలని సీఎం చెప్పారని దొరబాబు అన్నారు.

బౌద్ధ స్థూపాలు ఉన్న కొండపై
మైనింగ్ తగదు

» హైకోర్టు ఉత్తర్వులపై బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి హర్షం

గొల్లప్రోలు రూరల్, మార్చి 21: గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో సర్వే నెంబరు 133/1లో 372 ఎకరాల్లో విస్తరించి బౌద్ధ వారసత్వ సంపదగా నిలిచిన బుద్ధుని దాతు గర్భ స్థూపం గల కొండను మైనింగ్ పేరిట ధ్వంసం చేయడం తగదని బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి అధ్యక్షుడు పెయ్యల పావన్‌ప్రసాద్, గౌరవాధ్యక్షుడు అయితాబత్తుల రామేశ్వరరావు, కోశాధికారి పంతగడ రాంప్రసాద్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమితి సమావేశంలో వారు మాట్లాడుతూ 2021నుంచి మైనింగ్ తవ్వకాల అనుమతులకు వ్యతిరేకంగా పోరాటం జరుపుతున్నామన్నారు. దీనిపై జిల్లా కలెక్టరు, మైనింగ్, పురావస్తుశాఖ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడంతో ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసినా మళ్లీ తవ్వకాలు ప్రారంభించి యథేచ్ఛగా కొండను తవ్వేసి గ్రావెల్ తరలించారని తెలిపారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. దీనిపై కోర్టు తవ్వకాలపై స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. బౌద్ధ మహాస్థూపం విస్తరించి ఉన్న కొండపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాను కోర్టు ఆదేశించిందని తెలిపారు. హైకోర్టు ఉత్వర్వులతో మైనింగ్ నిలిపివేయడంతో బౌద్ధ స్థూపాన్ని పరిరక్షించుకునే వీలు ఏర్పడిందని వారు హర్షం వ్యక్తం చేశారు.



గొల్లప్రోలు మండలం కొడవలిలో తవ్వకాలు జరుపుతున్న ధనం కొండ



సమావేశంలో మాట్లాడుతున్న బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి

30,947 బ్యానర్లు, పోస్టర్లు
తొలగించాం

» రూ.23లక్షల36వేల విలువైన సరకు సీజ్
» అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీజ్
» జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21: జిల్లాలో రాజకీయ ప్రకటనలకు సంబంధించి ప్రభుత్వ ఆస్తులపై ఉన్న 30,947 పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, జెండాలను తొలగించామని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో కేవలం 24 గంటల్లో యుద్ధప్రాతిపదికన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వీటిని తొలగించామన్నారు. ప్రైవేట్ ప్రదేశాల్లో ఉన్న 10,119 వాల్ రైటింగ్, పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, జెండాలు తీసివేశామన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 68 ఫిర్యాదులొచ్చాయన్నారు. దీనిలో 41 ఫిర్యాదులు డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని రాగా వాటిని డ్రాప్ చేశామన్నారు. మరో 13 ఫిర్యాదులు సక్రమంగా లేవనీ, మిగిలిన 14 ఫిర్యాదులను ఆర్వోలు పరిష్కరించారన్నారు. ఎన్నికలకు సంబంధించి వివిధ రకాల అనుమతుల కోసం 56 దరఖాస్తులు రాగా 30 దరఖాస్తులకు అనుమతిచ్చామన్నారు. దీనిలో 11 తిరస్కరించగా మరో 11 పరిశీలనలో నాలుగు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని చెప్పారు.

రూ.23లక్షల 36వేల విలువైన సరుకు సీజ్

జిల్లాలో తనిఖీల్లో ఇప్పటివరకు రూ.23.36లక్షల విలువైన మద్యం, ఇతర సామాగ్రి సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. దీనిలో నగదు రూపంలో రూ.24వేలు ఉందన్నారు. దీనిలో పోలీస్‌శాఖ ద్వారా రూ.3.51లక్షల స్టేట్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్ రూ.74వేలు సీజ్ జరిగిందన్నారు. జిల్లాలో 324 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉండగా 263 ఆయుధాలను డిపాజిట్ చేశారన్నారు. 61 ఆయుధాలకు ఎసెన్షియల్ కింద మినహాయింపు ఇచ్చామన్నారు. 24 గంటల్లో ఆకస్మిక తనిఖీల్లో 203 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు.

నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయండి

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సీవిజిల్ యాప్‌తోపాటు ఇతర మార్గాల ద్వారా కూడా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఓటర్లు ఇచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగే చర్యలు తీసుకుంటామన్నారు.



తునిలో కూలీలతో ఫ్లెక్సీలు తొలగిస్తున్న ఎంపీడీవో

వైసీపీ ప్రచార యావకు ప్రజాధనం వృథా

తుని రూరల్, మార్చి 21: వైసీపీ ప్రచార యావకు ప్రజాధనం వృథా అవుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రచారానికి అడ్డూఅదుపులేకుండా చెట్లు, విద్యుత్ స్తంభాలు, గృహాలు, ప్రభుత్వ భవనాలు, ఆఖరికి చిన్నపిల్లలకు అందజేసే పాల ప్యాకెట్లు, చెక్కీ ప్యాకెట్లు వదలకుండా అన్నింటిపై వైసీపీ స్టిక్కర్లతో ప్రచారం చేసుకుంది. అంబులెన్స్‌నుంచి ఆర్టీసీ బస్సుల వరకు వైసీపీ జెండా నమూనా రంగులు వేసి ప్రచార డప్పు కొట్టుకుంది. భారీ ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు, వందలాది సిద్ధం బోర్డులు తొలగించేందుకు, రంగులు చెరపడానికి భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీ పాలకుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రి రాజా వాహనాలు సీజ్

తుని రూరల్, మార్చి 21: వైసీపీ నాయకులు ఆగడాలకు ఈసీ ఎక్కడికక్కడే అడ్డుకట్ట వేస్తుంది. విచ్చలవిడిగా కోడ్ ఉల్లంఘించి బరితెగిస్తున్న వారిపై దృష్టిసారించింది. తాజాగా కాకినాడ జిల్లా మంత్రి దాడిశెట్టి రాజాకు చెందిన రెండు కార్లను ఎలక్షన్ టీం ఫ్లైయింగ్ స్క్వాడ్ సీజ్ చేసింది. వైసీపీ సిద్ధం స్టిక్కర్లు కార్లపై తొలగించకుండా తిరుగుతూ అగనంపూడి టోల్ ప్లాజావద్ద తనిఖీల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ కంటపట్టాయి. దీంతో ఎలక్షన్ టీం ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం గాజువాక ఇన్‌చార్జ్ రేవతి రెండు కార్లను సీజ్ చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.



అగనంపూడి టోల్ ప్లాజావద్ద సీజ్ చేసిన వాహనాలు

ఎన్నికల నియమావళి అమలులో పోలీసు యంత్రాంగానికి సహకరించాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ సిటీ, మార్చి 21: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో జిల్లా పోలీసు యంత్రాంగానికి అందరూ సహకరించాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కోరారు. సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల ప్రతినిధులకు పోలీస్‌శాఖ నుంచి కావాల్సిన వివిధ అనుమతులను సువిధ యాప్ ద్వారా పొందే వెసులుబాటు ఎన్నికల సంఘం కల్పించిందని తెలిపారు. స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసుశాఖ నుంచి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్లకు ఎప్పుడైనా ఎన్నికల ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అందుకు తగిన విధంగా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచామని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన ప్రతినిధులు వెలిబుచ్చిన వివిధ సందేహాలను ఎస్పీ నివృత్తి చేశారు.

ప్రజలందరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి: ఎస్పీ

ప్రతిఒక్కరి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని, ప్రజలందరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ప్రజల్లో ధైర్యం నింపేందుకు కేంద్ర సాయుధ బలగాలతో జిల్లా పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు.

పోలీసులకు
ఉత్తమ సేవా పురస్కారాలు

కాకినాడ సిటీ, మార్చి 21: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసు, ఫైర్ సర్వీసు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది ఉత్తమ సేవా పురస్కారాలు ప్రకటించింది. ఈ మేరకు గురువారం గెజిట్ విడుదల చేసింది. కాకినాడ జిల్లా పరిధిలో పలువురికి పురస్కారాలు లభించాయి. తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.రాజబాబు, డీఏఆర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పీవీ అప్పారావు, డీఎస్‌బీలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆర్‌వీఎస్ భాస్కర్, డీఏఆర్, ఏఆర్‌పీసీగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరాజు, పెదపూడి పోలీస్‌స్టేషన్‌లో పీసీగా పనిచేస్తున్న ఎస్.అప్పారావు పురస్కారాలకు ఎంపికయ్యారు. కాకినాడ ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ ఆర్.భాస్కరరావు, పెద్దాపురం ఫైర్ స్టేషన్ డ్రైవర్ ఆపరేటర్ ఎస్.గణపతి, కాకినాడ ఓఎస్‌జీసీ హెడ్ కానిస్టేబుల్ కె.సువర్ధరాజు ఉత్తమ సేవా పురస్కారాలు పొందనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్త ఈ గెజిట్ జారీ చేశారు.

స్పా సెంటర్‌పై కాకినాడ టూటౌన్ పోలీసుల దాడి

» ఐదుగురి అరెస్టు

కాకినాడ సిటీ, మార్చి 21: బాడీ మసాజ్ ముసుగులో వ్యభిచారం జరుగుతుందనే సమాచారం మేరకు కాకినాడ భానుగుడి సెంటర్ సమీపంలోని ఈశా స్పా సెంటర్‌పై టూ టౌన్ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. కోల్‌కత్తాకు చెందిన ఒక మహిళ, ఇద్దరు విటులు, ఇద్దరు స్పా సెంటర్ నిర్వాహకులు కలిపి మొత్తం ఐదుగురిని అరెస్టు చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి గురువారం కోర్టుకు తరలించగా నిర్వాహకులకు 14రోజులు రిమాండ్ విధించారు. స్పా, బ్యూటీ పార్లర్, సెలూన్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, క్రాస్ మసాజ్, వ్యభిచారం చేసేవారికి చట్టప్రకారం జైలు తప్పదని టూటౌన్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.



కరెంటు పంచాయితీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో ఏ వ్యవస్థకైనా అవస్థ తప్పదు మరి.. చివరికి విద్యుత్ పంపిణీ సంస్థదీ అదే పరిస్థితి. వైసీపీ ప్రభుత్వ తీరు కారణంగా నాలుగేళ్ల నుంచీ అవస్థలతో కొట్టుమిట్టాడుతోంది. సామాన్యుడు ఓ రూ.150ల బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సిబ్బంది ఠంచనుగా వచ్చి ఫీజు లాక్కెళ్లిపోతారు. వినియోగదారుడు మళ్లీ ఏ అప్పోసొప్పో చేసి జరిమానాతో బిల్లు చెల్లించి కరెంటు ఆఫీసుకు వెళ్లి బతిమలాడుకుంటే ఏ సాయంత్రానికో దయతలచినపుడో వచ్చి సరఫరా పునరుద్ధరిస్తారు. ఈ అధికార దర్పమంతా సామాన్యుడి విషయంలోనే. పెద్దలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ విషయంలో పనిచేయదు. ఈ క్రమంలో కరెంటు పంపిణీ సంస్థకు, విద్యుత్ అధికారులకు ఇప్పుడు 'కరెంటు పంచాయతీ' తెగడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు కరెంటు వైరుకు పట్టుకున్న కార్బన్ మాదిరిగా పేరుకుపోవడంతో బిల్లుల వసూళ్లకు విద్యుత్ అధికారులు, సిబ్బంది చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితం కానరావడం లేదు.

- విద్యుత్ పంపిణీ సంస్థకు కొండలా బకాయిలు
- చెల్లించాల్సిన వీధిలైట్ల బకాయిలు రూ.283 కోట్లు
- విద్యుత్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ కార్యాలయాల తీరూ అదే
- చెల్లించాల్సిన బిల్లులు సుమారు రూ.43 కోట్లు
- విద్యుత్ సిబ్బంది ప్రదక్షిణలు..అయినా ప్రయోజనం శూన్యం



నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి..

పంచాయతీలు సాధారణంగా వీధి దీపాలకు, తాగునీటి సరఫరా చేయడానికి మోటార్లకు విద్యుత్ ఎక్కువగా విని యోగిస్తుంటాయి. దీని నిమిత్తం కరెంటు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా బిల్లుల చెల్లింపులు క్రమం తప్పాయి. గతంలో పంచాయతీల్లో వీధి దీపాలు తదితర అవస రాలకు వినియోగించిన బిల్లుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ పంపిణీ సంస్థలకు సర్దుబాటు చేస్తూ ఉండేది. దీంతో ఇటు పంచాయతీలకు, అటు పంపిణీ సంస్థలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే గత నాలుగేళ్లగా పంచాయతీలనే నేరుగా కరెంటు బిల్లులు కట్టుకోవాలని చెప్పడంతో కష్టాలు ఎక్కువయ్యాయి. అసలే నిధులు, విధులు లేకుండా మూలుగుతున్న పంచాయతీల నెత్తిపై తాటిపండు పడినట్లయ్యింది. పంచాయతీల్లో సొమ్ములు లేక.. నిధులు రాక నాలుగేళ్లుగా బిల్లులు చెల్లించలేకపోయారు. పంచాయతీలకు గ్రాంటు రూపంలో వచ్చే కేంద్ర ప్రభుత్వ నిధులు దారి మళ్లడం, సర్పంచ్‌ల అధికారంతో ఆటలు ఆడడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. పాలక మండళ్లు లేకుండా ప్రత్యేకాధికారుల పాల నలో ఉన్న పంచాయతీల్లో కూడా బకాయిలు పేరుకుపోయా యి. ఆర్డీవో, సబ్ కలెక్టరు స్థాయి అధికారులు ప్రత్యేక అధికా రులుగా వ్యవహరిస్తుండడంతో విద్యుత్ సిబ్బంది నోళ్లు మెదప లేని పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శులకు విద్యుత్ అధికారులు ఫోన్లు చేస్తే ఏదోక సమాధానం చెప్పి కాలయా పన చేస్తున్నారని చెబుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిపి వేస్తే ప్రజలు ఇబ్బంది పడతారనే కారణంతో విద్యుత్ సిబ్బంది బతిమలాడుకోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

జిల్లాలను విభజన చేసినప్పటికీ విద్యుత్ సర్కిల్‌ని విభ జించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 1029 పంచాయతీలు ఈ సర్కిల్ పరిధిలోనే ఉన్నాయి. గత నెల 29 వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పంచాయతీల బకాయిలు రూ.9,14,48,198.. తూర్పుగోదావరి (విభజిత) రూ.149,38,34,662.. కాకినాడ జిల్లా 94,83,51,858.. కోనసీమ జిల్లా రూ.29,46,49,471.. వెరసి మొత్తం రూ.282,82,84,189 బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందాక

పేరుకుపోయిన బకాయిలు ఇవే

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ అంటే 11 నెలల బిల్లులు వసూ లు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పినా ఫలితం కానరావడం లేదు. ఉమ్మడి తూర్పులోని పంచాయతీల్లో కోలమూరు రూ.1.05 కోట్ల బకాయిలతో తొలి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరుసగా ధవళేశ్వరం రూ.1.03 కోట్లు, దివాన్ చెరువు రూ.1 కోటి, ద్వారపూడి రూ.97.56 లక్షలు, హుకుంపేట రూ.92 లక్షలు, శాటిలైట్ సిటీ పంచాయతీలో రూ.86.27 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి.

ప్రభుత్వ కార్యాలయాల తీరిది..

పంచాయతీల మాదిరిగానే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలూ విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. వీటిలో గ్రామీణ నీటి సరఫరా, వైద్యం, రెవెన్యూ శాఖలు ముందు వరుసలో ఉన్నా యి. ప్రభుత్వ కార్యాలయాలకు నెలకు సుమారు రూ.40 కోట్ల విద్యుత్ బిల్లులు వస్తుంటే 10% కూడా వసూలుకాని పరిస్థితి ఉంది. గత నెల 29 నాటికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.15,87,93,696.. తూర్పు గోదావరి రూ.13,92,01,030.. కాకినాడ జిల్లా రూ.31,77,43,944.. కోనసీమ జిల్లా రూ.12,84,84, 656.. మొత్తం కలిపి ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.74,42,23,326 ఉన్నాయి. గతంలో బడ్జెట్ కేటాయింపుల ప్రకా రం నిధుల విడుదల ఉండడంతో విద్యుత్ బిల్లులు చెల్లించేసేవారు. కానీ, నాలుగేళ్ల నుంచీ అస్తవ్యస్తం కావడంతో సమస్య తలెత్తిందని చెబుతున్నారు.

గరుడ వాహనంపై ఊరేగింపు

ఘనంగా కొనసాగుతున్న నరసన్న కల్యాణోత్సవాలు





గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



పండిత సభ నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 21: లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు పండ్లు, పుష్పాలు సమర్పించి మంగళహారతులిచ్చి ఆశీస్సులు అందుకున్నారు.

అలరించిన పండిత సభలు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రంగరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు జరిగాయి. ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మీనరసింహభట్టర్ స్వామి అధ్యక్షతన సభలో కందాడై శ్రీనివాసాచార్య, భద్రాచలం ఆస్థాన పండితుడు కందాడై మురళీకృష్ణ స్వామి వివిధ ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. కార్యక్రమాల్లో రంగరాజ భట్టర్, పెదపాటి గిరిధరాచార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, గోవర్ధన తిరుమలాచార్యులు, పెద్దింటి రంగాప్రసాద్, పెద్దింటి సత్తిబాబు, ఇరగవరపు కృష్ణామాచార్యులు, మార్గపురి రాంబాబు సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి వీరగణేష్, ఇసుకపల్లి రాజారావు, కొత్తంగి బుచ్చి రామయ్య పాల్గొన్నారు.

అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం



ఏర్పాట్లపై ప్రశ్నిస్తున్న భక్తులు

కోరుకొండ, మార్చి 21: నరసన్న కల్యాణోత్సవాల్లో ఈ సంవత్సరం అన్నవరం దేవస్థానం అధికారులు అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తూ భక్తులను అవమానిస్తున్నారని గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, మాజీ సర్పంచ్ నీరుకొండ బాబ్జి, పలువురు కల్యాణ దంపతులు నిరసన వ్యక్తం చేశారు. గత రాత్రి స్వామి వారి కల్యాణం సందర్భంగా ఒక్కో దంపతుల నుంచి రూ.1116 రుసుము తీసుకున్న అధికారులు కల్యాణం అనంతరం వారికి అందజేయాల్సిన స్వామి వారి ముత్యాల తలంబ్రాలు, లడ్డు ప్రసాదాలు అందించలేదని పేర్కొన్నారు. 225 మంది స్వామి వారి కల్యాణం టిక్కెట్లు తీసుకుని పీటలపై కూర్చున్నారు. వీరందరికీ వరుస క్రమంలో ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలు అందించాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యంతో తోపులాట జరిగి కల్యాణ దంపతులకు తలంబ్రాలు, లడ్డూలు అందలేదని వారు ఆరోపించారు. అన్నవరం దేవస్థానానికి సుమారు 200 మంది సిబ్బంది కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవ డ్యూటీలు నిర్వహిస్తున్నారు. అయితే వారు ఎవరూ బాధ్యత తీసుకోకపోవడంతో భక్తులకు అడుగడుగునా తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. అదే విధంగా భక్తులకు ఉచిత దర్శనం గేటుకు తాళం వేసి ఉంచడం వల్ల భక్తులు అందరూ తప్పనిసరిగా టిక్కెట్ కొని దర్శనానికి వెళ్లాల్సిన ఇబ్బందికర పరిస్థితులను అన్నవరం దేవస్థానం అధికారులు కావాలనే కల్పిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌అశోక్ దంపతులు



స్వామి,అమ్మవార్లు

యానాం, మార్చి 21: యానాంలో శ్రీవారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. అర్చకులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులు గావించారు. కల్యాణాన్ని అనువంశిక ఉత్సవదారులు చింతా వెంకటసుబ్బరావు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్-లక్ష్మీస్నేహ దంపతులు కూడా పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, సువర్ణ యజ్ఞోపవీతం, సువర్ణ మంగళ సూత్రం, ముత్యాల తలంబ్రాలు అందించారు. వేద పండితులు కల్యాణ క్రతువును అంగరంగ వైభవంగా జరిపించారు. తిలకించడానికి వచ్చిన ముత్తయిదువులందరికీ పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణను అతిథులు ప్రారంభించారు. గురువారం సాయంత్రం తోట వేణుగోపాలరావునాయుడు ఉత్సవదారులుగా ఉన్న హనుమంత వాహనంపై స్వామివారిని ఆశీనులు గావించి విశేష పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామివారు విహరించగా భక్తులు తిలకించి తరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), మార్చి 21: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వాహనదారులకు రెండేసి రోజుల జైలు శిక్ష, మరో 12 మందికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ నాలుగో ఏజేఎఫ్ సీఎం కోర్టు జడ్జి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని కాకినాడ నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో ప్రవేశపెట్టగా నలుగురు వాహనదారులకు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించారు. మరో 12 మందికి తలో రూ. 10 వేలు జరిమానా ఇలా మొత్తం రూ.1.20 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్-2 సీఐలు చైతన్యకృష్ణ, రమేష్ తెలిపారు.

కార్పెంటర్ ఆత్మహత్య

అల్లవరం, మార్చి 21: యజమానిని మోసగించానన్న మనస్తాపంతో ఓ కార్పెంటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలేనికి చెందిన కార్పెంటర్ మల్లాడి లక్ష్మణరావు (50) అమలాపురంలోని మాధవి ఫర్నీచర్ షాపులో పనిచేస్తున్నాడు. అతను యజమాని పేరిట కొన్ని సామాన్లు తెచ్చి అమ్మాడు. దీనిపై యజమాని అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు కావడంతో యజమానిని మోసగించిన మనస్తాపంతో ఇంటి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మణరావుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆత్మహత్యగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంత నిర్లక్ష్యమా?



వంట గది నిర్వహణ

- పొంచివున్న ప్రమాదం
- ఒకే గదిలో ఎండీఎం, అంగన్వాడీ వంటకాలు
- పక్కనే పిల్లల తరగతులు
- ఫైర్ సిబ్బంది హెచ్చరించినా అదే తీరు

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఓ పాఠశాల విద్యార్థుల భద్రతా విషయంలో నిర్లిప్తంగా ఉండడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో అంగన్వాడీ కేంద్రాలు వేరుగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలల్లో కలిపారు. దీంతో అటు చిన్నారులకు బోధన చేసే విషయంలో, ఇటు వంట చేసే విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లాలాచెరువు సమీపంలోని ఓ ప్రాథమిక పాఠశాలలోకి అంగన్వాడీని తరలించారు. అయితే అప్పటికే మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న చిన్న వంటగదిలోనే అంగన్వాడీ పిల్లలకు వంట చేయడానికి సర్దుకోవాలని చెప్పారు. దీంతో ఇలా ఫొటోలో కనిపిస్తున్న విధంగా రెండు సిలిండర్లను, రెండు పొయ్యిలను పక్కపక్కన పెట్టి రోజూ వంట చేస్తున్నారు. ఆ గదికి ఆనుకొనే పిల్లల తరగతి గదులు ఉన్నాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాద నివారణపై ఈ పాఠశాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అప్పుడు రెండు సిలిండర్లు, పొయ్యిలు ఒకేచోట పెట్టి వంట చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మార్పు చేసుకోవాలని సూచించారు. కానీ, ప్రధానోపాధ్యాయుల తీరులో నేటికీ మార్పు రాలేదు. దీంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా పెద్ద నష్టానికి దారి తీసే అవకాశం ఉందంటూ తల్లిదండ్రులు భయపడుతున్నారు. అంగన్వాడీ వర్కర్‌లకు వంట కోసం వేరే గది ఇచ్చే అవకాశం ఉన్నా.. ఆ గదిని వ్యర్థాలకు ఉపయోగిస్తుండడం బాధ్యతా రాహిత్యానికి రుజువని చూపుతున్నారు.

ప్రతి జీవికి అడవితో అనుబంధం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ కృష్ణప్రియ

దివాన్‌చెరువు, మార్చి 21: ప్రపంచంలో ప్రతి జీవికి అడవులతో సంబంధాలు ఉంటాయని ఏపీ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. దివాన్ చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ ఏడాది అడవులు ఆవిష్కరణ-మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు అనే థీమ్‌తో అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కృష్ణప్రియ వివరించారు. మనం తాగేనీరు, ఆహారం, మందులు, ఆశ్రయం, ఆక్సిజన్ కోసం అడవులతో సంబంధం కలిగి ఉంటుందని అటువంటి అడవులను కాపాడేందుకు అటవీశాఖ కృషి చేస్తోందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ అడవులను పరిరక్షించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తూ రాబోయే తరాలకు మంచి వాతావరణంలో జీవించే అవకాశాలను కల్పించాలని కోరారు. శిక్షణలో ఉన్న అటవీ బీట్ అధికారులు మాట్లాడుతూ ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎర్రచందనం, పెద్దపులి, కలివి కోడి వంటి వాటిని ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్రం హెచ్‌వోడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వృక్షశాస్త్రం, అటవీ విజ్ఞానాన్ని పెంపొందించడంలో తమ కళాశాల బోటనీ విద్యార్థులు కృషి చేస్తున్నారని, బోటనీ విభాగం అటవీశాఖతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు అటవీ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. చివరిగా కళాశాల విద్యార్థులు, అధికారులు కలిసి అటవీ సంరక్షణలో తమ వంతు పాత్రను మనస్ఫూర్తిగా నిర్వహిస్తామని, పర్యావరణానికి ప్రతికూలమైన ఏ చర్యను చేపట్టబోమని ప్రతిజ్ఞ చేశారు.

శీతల పానీయాల గోదాములో అగ్నిప్రమాదం



కరప, మార్చి 21: కరపలోని ఒక శీతల పానీయాల గోదాములో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించి రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానిక పీఏసీఎస్ గోదాములో గ్రామానికి చెందిన కొర్ల చక్రయ్య శీతల పానియాల స్టాకు పెట్టుకుని హోల్ సేల్, రిటైల్ వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం రాత్రి గోదాముకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం తెల్లవారుజామున గోదాము షెట్టర్ల నుంచి పొగలు వస్తుండడం గమనించి తెరిచి చూశాడు. అప్పటికే మంటలు చెలరేగి రూ.85 వేల నగదు, ల్యాప్‌టాప్, కౌంటింగ్ మిషన్, సీసీ కెమెరాల ఎక్విప్‌మెంట్, శీతల పానియాల కేసులు, ప్రింటర్, తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్ స్టేషన్ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. వీఆర్వో ప్రభుదాస్ ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎంఎల్ఎస్ పాయింట్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పిఠాపురం, మార్చి 21: పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న సివిల్‌సప్లైస్ గొల్లప్రోలు ఎంఎల్ఎస్ పాయింట్‌ను విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సరుకుల నిల్వల్లో భారీ తేడాలు ఉన్నట్లు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన మండల లెవెల్ స్టాక్ పాయింట్‌లో విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు జరిపారు. సరుకుల నిల్వలను పరిశీలించారు. ఇందులో పలు లోపాలు బయటపడ్డాయి. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన కందిపప్పు రికార్డుల్లో కంటే 3.99 క్వింటాళ్ల అధికంగా ఉన్నట్లు, రేషన్‌కార్డుదారులకు అందించాల్సిన కందిపపప్పు 7.13 క్వింటాళ్ల తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పామాయిల్ లీటరు ప్యాకెట్లు 112 అదనంగా ఉండగా, అరలీటరు ప్యాకెట్లు 245 తక్కువగా ఉన్నాయి. గోధుమపిండి 3.87 క్వింటాళ్లు, పంచదార 1.74 క్వింటాళ్లు, ఫోర్టిఫైడ్ బియ్యం 5 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడయింది. సరుకుల నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు వెలుగుచూడటంతో పాటు స్టాకు బోర్డుపై నిల్వల వివరాలు రాయకపోవడం, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకపోవడాన్ని గుర్తించారు. సరుకుల నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు ఉన్న నేపథ్యంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సివిల్‌సప్లైస్ డీఎంకు సిఫారసు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు, సీఐ శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు విజయకుమార్, జీవానందం వలీ, సీఎస్ డీటీ మర్రి వీరాస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు





విద్యుత్ దీపాలంకరణ

దేవరపల్లి, మార్చి 21: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఉత్సవాల్లో అన్ని మతాలకు అతీతంగా భక్తులు పాల్గొనడం విశేషం. హిందువులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొని మొక్కుబడులు తీర్చుకుంటారు. తలనీలాలు సమర్పించడం, ముడుపులు సమర్పించడం చేస్తుంటారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ తెలిపారు.

మరిడమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, మార్చి 21: మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురువారం లెక్కించారు. 41 రోజులకు రూ.1,66,797ఆదాయం సమకూరినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు చల్లా ఉదయ్‌బాబు నాయుడు, టీవీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురంలో బీసీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న వర్మ


తాళ్లరేవు : గోవలంక సర్పంచ్‌ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాట్ల బుచ్చిబాబు


ప్రత్తిపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాడు అభ్యర్థి సత్యప్రభ


గండేపల్లి: మల్లేపల్లిలో జనసేన నాయకులతో నెహ్రూ

ఫిర్యాదు చేసినా చనిపోయిన వారి ఓట్లు తొలగించలేదు

పిఠాపురం, మార్చి 21: ఓటర్ల జాబితా తయారీలో అధికారుల నిర్లక్ష్యం బయటపడుతూనే ఉంది. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు ఉన్నాయని తొలగించాలని ఫిర్యాదు చేసినా తొలగించని పరిస్థితి. ఇదే విషయాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ గురువారం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టరు రామసుందరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేట గ్రామంలో పోలింగ్ బూత్ నెంబరు 17లో చనిపోయిన ఓటర్లు ఎనిమిది మంది ఉన్నారని బీఎల్‌వోకి తెలియజేసినా ఇప్పటి వరకూ తొలగించలేదని టీడీపీ నాయకులు తెలిపారు. అదేవిధంగా ఇతర గ్రామాలకు చెందిన 60 మందిని ఇక్కడ ఓటర్లుగా చేర్చారని చెప్పారు. ఇందుకు బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల పెన్షన్లును వలంటీర్ల ద్వారా కాకుండా అధికారులు ద్వారా అందించేలా చూడాలని కోరారు.

దాతృత్వం వెలకట్టలేనిది

● ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 21: దాతృత్వం వెలకట్టలేనిదని దేవదాయశాఖ కార్యాలయ పర్యవేక్షణాధికారి సోమరాజు అన్నారు. స్థానిక పెద్దమార్కెట్‌లో గురువారం బంగారు చిన శోభనాద్రీశ్వరరావు సత్రం 100వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్నారు. చినశోభ నాద్రీశ్వర రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు, సత్రం పర్యవేక్షకులు అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.1,26,109

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 21: బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలు తెరిచి లెక్కించారు. మూడు నెలలకుగాను రూ.1,26,109 హుండీ ఆదాయం వచ్చింది. దేవాలయం వీధిలోని దేవస్థానం ఆవరణలో గురువారం ఈ లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు, దేవదాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలనను తరిమికొట్టాలి

● సామర్లకోటలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు పిలుపు


సామర్లకోట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, మార్చి 21: రాష్ట్రంలో అరాచక వైసీపీ పాలనను తరిమికొట్టేందుకు టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తుమ్మల బాబు, విత్తనాల వెంకటరమణలు పిలుపునిచ్చారు. ఎన్నికల కూటమిలో భాగంగా మూడు పార్టీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చినరాజప్ప అధ్యక్షతన ఆత్మీయ సమావేశం గురువారం రాత్రి సామర్లకోట పూర్ణా ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారాలువేసి ప్రజల ధనాన్ని దోచుకుంటూ, మరోవైపు జే బ్రాండ్ కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ మందు బాబుల ఆరోగ్యా లతో ఆటలాడుతున్నారని విమర్శించారు. అనంతరం బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ అమలుచేస్తున్న పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం సిగ్గులే కుండా వైసీపీ నాయకుల ఫోటోలను ముద్రించి ప్రచారం చేసుకో వడం సిగ్గుచేటని విమర్శించారు. జనసేన పెద్దాపురం ఇంచార్జి తుమ్మల బాబు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని జనసే నానిలు అందరూ బలపర్చడం ద్వారా పెద్దాపురం నియోజకవర్గంలో మూడు పార్టీ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పను గెలిపించేందుకు అందరూ ఏకతాటిపై నిలవాలని తుమ్మల బాబు పిలుపునిచ్చారు. ఈ సభకు పెద్దాపురం నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆత్మీయ విందులో పాల్గొన్నారు.

మూడు పార్టీల కండువాలతో ఎమ్మెల్యే చినరాజప్ప

టీడీపీ, జనసేన, బీజేపీ తెలుగుదేశం, భారతీయ కూటమి అభ్యర్థిగా పోటీ బరిలో ఉన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో గురువారంరాత్రి సామర్లకోటలో నిర్వహించిన మూడు పార్టీల ఆత్మీయ కూటమి సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప మూడు పార్టీల కండువాలను ధరించడం విశేషం. తొలిసారిగా నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన ఈ తొలిసదస్సుకు ఊహాలకు మించి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో పాల్గొనడంతో మూడుపార్టీలకు చెందిన నాయకులలో జోష్ పెరిగింది.

మాటిచ్చి మడంతిప్పేసిన వైసీపీని నమ్మొద్దు: బుచ్చిబాబు

తాళ్లరేవు: ఒక్కచాన్స్‌తో ప్రజలకు మాటిచ్చి మడంతిప్పేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మవద్దని ఉమ్మడిపార్టీల అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. గురువారం కోరింగ పంచాయతీ పెదబొడ్డువెంకటాయపాలెం, పాతకోరింగ గ్రామాల్లో గ్రామకమిటీ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చినబొడ్డులో పెమ్మాడి కృష్ణవేణి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రజలను మోసగించిన వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మవద్దని టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఉప్పంగల గ్రా మంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్‌సిక్స్ బాండ్లను పంపిణీ చేశారు. వాడ్రేవు వీరబాబు, టేకుమూడి అనంతలక్ష్మి, పొన్నమండ రామలక్ష్మి, జవ్వాది సత్యవేణి, వెంటపల్లి ఉమామహేశ్వరి, టేకుమూడి లక్ష్మణరావు, చంద్రాల ఆదినారాయణ, జవ్వాది తాతాజీ, దాసరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గోవలంక సర్పంచ్

గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ తన అనుచరులతో టీడీపీలో గురువారం చేరారు. టీడీపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు గోవలంక సర్పంచ్ తన అనుచరులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రంలో టీడీపీ నేతలు సాగి వెంకటసుబ్బరాజు, బోయిడి వేణుగోపాల్, మోర్త భైరవమూర్తి, మోపూరి వెంకటేశ్వరరావు, వేగేశ్న భాస్కరరాజు పాల్గొన్నారు.

● తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో గ్రామకమిటీ అధ్యక్షుడు సంగాడి కామేశ్వరరావు, కావూరి సత్యనారాయణల ఆధ్వర్యంలో 50కుటుంబాలు టీడీపీ తీర్థం తీసుకున్నారు. జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, శ్రీనివాసరావుల నేతృత్వంలో వార్డుసభ్యురాలు యర్రంనీడి భవాని, తనుకుల రాజులను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జల్లి తిరుపతిరావు, మోర్త వీరబాబు, పెయ్యల ప్రసాద్, మాతా రామకృష్ణ, వస్కా కృష్ణ, రేవు, కావూరి, బుడితి, దోనుపాటి, పాము, కమిడి, నల్లి కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

రాక్షస పాలన అంతానికి ఓటు ఆయుధం కావాలి : దివ్య

తొండంగి: రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షసపాలన అంతానికి ప్రతిఒక్కరూ తమ ఓటును ఆయుధంగా ఉపయోగించాలని తుని టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం రావికంపాడులో జరిగిన బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మెర్ల రవీంద్రనాధ్ చౌదరి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి దివ్య కండవాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. టీడీపీ నేతలు మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, యనమల రాజేష్, యనమల నాగేశ్వరావు, యనమల కృష్ణ, చొక్కా అప్పారావు, అరిగెల నర్సింహమూర్తి పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

సర్పవరంజంక్షన్: గొడారిగుంటకు చెందిన వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కౌన్సిల్ సభ్యులు కలవల మరియమ్మ, కలవల కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో పలువురు తటస్థులు గురువారం నానాజీ నివాసం వద్ద జనసేన పార్టీలో చేరారు. వీరికి కాకినాడరూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ పార్టీ కండువాలువేసి ఆహ్వానించారు. చీడిగకు చెందిన గుత్తులనాగేశ్వరరావు, ఉదయ్‌స్వామిలు పార్టీలో చేరారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వ స్థాపనే లక్ష్యం : జ్యోతుల నెహ్రూ

గండేపల్లి: టీడీపీ-జనసేన ప్రభుత్వ స్థాపనే లక్ష్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలో మల్లేపల్లిలో గురువారం జ్యోతుల నెహ్రూ జనసేన నాయకులను కలిశారు. నెహ్రూ మా ట్లాడుతూ టీడీపీ, జనసేన కలయికతో పార్టీ బలపడిందన్నారు. జనసేన నాయకులతో గ్రామంలో పర్యటించారు. జనసేన నాయకులు నెహ్రూకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీఅధ్యక్షుడు పోతుల మోహనరావు, తెలగరెడ్డి భద్రరావు, రామకుర్తి నరసింహం, కాపు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సహకరించండి : ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నానాజీ

కరప: రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన, టీడీపీ, బీజేపీ కలిసి ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమి విజయానికి సహకరించాలని కాకినాడరూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిలు కోరారు. వేములవాడ శివారు సిరిగలపల్లిలంక గ్రామంలో గురువారం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. నానాజీ, సత్తిబాబు, అనంతలక్ష్మిలకు స్థానికులు మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ ప్రచారంలో ఆయా పార్టీల నాయకులు గుల్లిపల్లి శ్రీనివాసరావు, బోగిరెడ్డి గంగాధర్, మద్దూరి స్వామి, చీపురుపల్లి జయేంద్రబాబు, అప్పనపల్లి నారయ్య, పెంకే దుర్గారావు, కురుపూడి రాంబాబు, గుత్తుల నాగేశ్వరరావు, గుత్తుల తాతారావు, పాలిక వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సత్యప్రభ విజయమే లక్ష్యంగా పనిచేయండి'

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సత్యప్రభ రాజా గెలిపే లక్ష్యంగా జనసేన, టీడీపీ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మవరంలో ప్రతిభా పాఠశాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం నియోజకవర్గ జనసేన, టీడీపీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్డీఏ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయం చేకూర్చేందుకు ఇప్పటి నుంచే కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. త్వరలోనే టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని అభ్యర్థి సత్యప్రభ రాజా చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ కలిసికట్టుగా పనిచేయాలని ఆమెకోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి శేషారావు, జనసేన, టీడీపీ నాయకులు మేడిశెట్టి చంద్రకిరణ్, పెంటకోట మోహన్, నల్లల రామకృష్ణ, మేకల కృష్ణ పాల్గొన్నారు.


తొండంగి: కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న యనమల దివ్య


కరప: సిరిగలపల్లిలంకలో ప్రచారం చేస్తున్న నానాజీ, సత్తిబాబు, అనంతలక్ష్మి

వైసీపీ నుంచి 100 మంది దళితులు టీడీపీలో చేరిక

కాజులూరు: కాజులూరు మండలం గొల్లపాలెంలో టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన సుమారు 100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ మేరకు రామచంద్రపురం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శలపాక గ్రామంలో పలువురు దళిత మహిళలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దళిత నాయకులు పలివెల సోమరాజు, పలివెల శివ, పలివెల నానిబాబు, పలివెల నరసింహ, పలివెల సుమంత్, పలివెల కుమారి, కాంద్రకోట నాగదేవి, బుంగా సత్యవతి, మిరియాల వీరమ్మ, పలివెల ఎలిసమ్మ తదితరులు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు పేపకాయల బాబ్జీ, క్లస్టర్ కోఆర్డినేటర్ వనుం వీరబ్రహ్మం, పోతుల మాధవ, అంగర కృష్ణ పాల్గొన్నారు.

పవన్ విజయం కోసం పాదయాత్ర

పిఠాపురం: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ విజయం కోరుతూ 23వ తేదీన పట్టణంలోని సూర్యనారాయణమూర్తి ఆలయం నుంచి తొలి తిరుపతి వరకూ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు సూరవరపు కృష్ణార్జునరావు, మార్నీడి రంగబాబు, మాగాపు గొల్లబాబు, పిండి శ్రీను, పిడుగు శ్రీను, వనుము వీరబాబు, బాలిపల్లి బుజ్జిలు తెలిపారు. పవన్‌ను లక్ష ఓట్లు మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు.

సత్యదేవుడికి కేజీ వెండి ప్రతిరూపాలు అందజేత

అన్నవరం, మార్చి 21: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి గురువారం రాజమహేంద్రవరంనకు చెందిన ప్రకాష్ అనే భక్తుడు సుమారు కేజీ బరువుకలిగిన సత్యదేవుడి వెండి ప్రతిరూపాలను అందజేశారు. వీటి విలువ రూ. 80వేలు ఉంటుందని దాత తెలిపారు. వీటిని ఏపీఆర్వో గణపతికి దాత అందజేశారు. దాత ప్రకాష్‌ను అభినందించి వారికి స్వామివారి ప్రత్యేకదర్శనం, ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా దేవాన్ష్ పుట్టిన రోజు వేడుకలు

ప్రత్తిపాడు, మార్చి21: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మనవడు దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు గురువారం ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ, ఆమె తనయుడు సాయిదర్శిత్‌లు నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తొలుత టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కేక్ కట్ చేసి దేవాన్ష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు, కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు, జ్యోతుల పెదబాబు పాల్గొన్నారు.

పేదలకు అన్నవితరణ

కాకినాడ సిటీ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మనవ డు నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు గురువారం కాకినాడలో జరిపారు. చిన్నారులతో దేవాన్ష్ పుట్టినరోజు కేక్ కట్ చేయించి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మండపాక సుబ్బు, చెరుకూరి సాయిరామ్‌వర్మ ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేదలకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కర్రి వీరబాబు, యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో గండేపల్లి మండలం టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో నారా చంద్రబాబునాయుడు మనవడు, నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతులనెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, సూరంపాలెం బాలు, బొల్లాంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, కుంచే రామకృష్ణ, కుంచే కోటి, అడబాల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్నదానం

సర్పవరం జంక్షన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా గురువారం టీడీపీ రూరల్ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) జీజీహెచ్‌లోని సుమారు 500 మంది రోగులు, సహాయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మట్టా ప్రకాశ్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, బచ్చల కామేష్, కోన వెంకట్‌లక్ష్మి, రొంగల రవి, మడ్డ శ్రీను, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: చంద్రబాబు మనుమడు నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలను వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. మార్కెట్ సెంటర్‌లో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్రణ సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాలి: ఆర్వో

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 21: ఎన్నికల ప్రచారం కోసం వివిధ రాజకీయ పార్టీలు ముద్రించే ఫ్లెక్స్‌లు, కరపత్రాలు, స్టిక్కర్లు, ఇతర ప్రచార సామాగ్రికి సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఫ్లెక్సీ ఆఫ్‌సెట్ ప్రింటర్లు, ఇతర ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమానులతో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఏ ఒక్కరూ ప్రింటింగ్‌కు ఆర్డర్ ఇచ్చినా అందుకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను వివరించారు. ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి లేదా సంస్థ, ఎప్పుడు, ఎంత వంటి సమాచారాన్ని నింపి కలెక్టరేట్, ఆర్వో కార్యాలయానికి పంపించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆయా ప్రిం టింగ్ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫ్లెక్స్ ప్రింటర్స్ ప్రతినిధులు ఎం.వెంకట్, మహేష్, శ్రీను, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సీతాపతిరావు పాల్గొన్నారు.

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి: జేసీ

పిఠాపురం: అన్ని రాజకీయపార్టీలు, అభ్యర్థులు ప్రచారం నిమిత్తం వినియోగించే ప్రచార వాహనాలకు అనుమతులు తప్పనిసరని, లేకుంటే సదరు వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టరు, పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి రామసుందరరెడ్డి స్పష్టంచేశారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయపార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల తేదీలు ప్రకటించడంతో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు.

ఎంసీసీ పక్కాగా అమలుచేయాలి: ఆర్డీవో

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ని పక్కాగా అమలుచేయాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ తదితర అధికారులతో నిర్వహించిన సమవేశంలో ఆయన డీఎస్పీ లతాకుమారితో కలసి గురువారం మాట్లాడారు. నామినేషన్ దాఖలు నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ సంబంధిత బృందాలు, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు ఏర్పాటుచేసిన నిఘా బృందాలు సమర్ధవంతంగా తమ బాధ్యతలను నిర్వర్తించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కానుకలు పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. పెద్దాపురం, సామర్లకోట తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి పాల్గొన్నారు.

రాజకీయ నాయకులు ఎన్నికల నియమాలు పాటించాలి

జగ్గంపేట: రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నియమాలు తప్పనిసరిగా పాటించాలని జగ్గంపేట నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆర్వో కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయపార్టీ నాయకులు, ఫ్లెక్స్, ప్రింటింగ్ ప్రెస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం, ఫ్లెక్స్ ప్రింటింగ్ విషయాలలో పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తహసీల్దార్ షేక్ ఇంతియాజ్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల అమలు పరిశీలన

సామర్లకోట: సామర్లకోట మండలంలోని అన్ని గ్రా మాలలో ఎన్నికల నిబంధనలు అమలు చేస్తుందీ, లేనిదీ తెలుసుకునేందుకుగాను సామర్లకోట మండల మోడల్ కాండక్ట్ కమిటీ అధికారులు గురువారం పర్యటించారు. మండలంలోని వెంకటకృష్ణరాయపురంలో పంచాయతీ కార్యాలంలోని వివిధ విభాగాలను పరిశీలించి పార్టీలకుగానీ, రాజకీయ నాయకులకు చెందిన ప్రచార సామగ్రి లేకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనానికి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చిత్రాలను కనిపించకుండా పేపర్లు అతికించారు. మండలంలోని అన్ని గ్రామాలలోగల ఎండీయూ వాహనా లకు ఇదే రీతిలో పేపర్లు అతికించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంసీసీ అధికారి శ్యామ్‌సుందర్ తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను పారదర్శకంగా అమలు చేయాలి : ఆర్‌వో కిషోర్

కరప: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పారదర్శకంగా అమలుచేయాలని కాకినాడరూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఈట్ల కిషోర్ సూచించారు. మండలంలో గురువారం ఆయన పర్యటించి పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులు, వీఆర్‌వోలతో సమావేశమై సార్వత్రిక ఎన్నికలను పురష్కరించుకుని తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కరప నుంచి సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అనేకం వస్తున్నాయని, నిబంధనలను అతిక్రమించే ఏ రాజకీయపార్టీని ఉపేక్షించవద్దన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, తహశీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఎంఈవో పి.సత్యనారాయణ, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాధవవర్మ నాటకం

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 21: సరస్వతీ గానసభ 120వ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రదర్శించిన మాధవవర్మ నాటకం ఆహూతులను ఆకట్టుకుంది. గురువారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో డాక్టర్ రామన్ ఫౌండేషన్, సాయిబాబా నాటక మండలి విజయవాడ ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శన నిర్వహించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు నంది అవార్డు పొందామని దర్శకుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ తెలిపారు.

రాజవరంలో బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు

రౌతులపూడి, మార్చి 21: రాజవరంలో జరుతున్న బాల్య వివాహాన్ని అంగన్‌వాడీ, పోలీస్ అధికారులు అడ్డుకున్నారు. బర్ల గంగరాజు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తెకు బాల్య వివాహం చేస్తున్నారు. గ్రామస్తులు అంగన్‌వాడీ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి, వీఆర్వో సరస్వతి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పోలీస్‌లు రాజవరం చేరుకుని బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండు సంవత్సరాల వరకు వివాహ వయస్సు వచ్చే వరకు వివాహం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓట్లు కోసం వస్తున్న వైసీపీ నేతలను నిలదీయాలి: మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 21: ఏనాడూ ప్రజల కష్టాలు గురించి పట్టించుకోకుండా నేడు ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వస్తున్న వైసీపీ నేతలను నిలదీయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గాన్ని రూ.2,800కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వహయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ గీత పదేళ్లుగా నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారని తెలిపారు. చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. క్లస్టర్లు వారీగా జయహో బీసీ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

కార్మికుల రక్షణకు భద్రతా చర్యలు తీసుకోవాలి

పెద్దాపురం, మార్చి 21: పెద్దాపురం నుంచి వాలుతిమ్మాపురం వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న లలితా ఇండస్ట్రీస్ యాజమాన్యం కార్మికుల రక్షణకు సరైన భద్రతా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఏఐఎఫ్‌టీయూ, ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వ ర్యంలో గురువారం స్థానిక దమ్ముపేటలో ధర్నా చేశారు. సంఘ నాయకులు వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు మాట్లాడుతూ కేవలం యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా రెండు నిండుప్రాణాలు పోయాయన్నారు. పరిశ్రమలో సరైన భద్రతా చర్యలు లేని కారణ ంగానే ప్రమాదం చోటుచేసుకుందని ఆరోపించారు. ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.30లక్షలు పరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేష్, సత్తిబాబు, వీరన్న, నారాయణరావు, వీరబాబు, రాజు, రాజబాబు, లోవ రాజు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఏలేశ్వరం, మార్చి 21: పట్టణంలో బాలాజీచౌక్ సెంటర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బుధవారంరాత్రి బాలాజీ వేంకటేశ్వరస్వామి 38వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త గోపు వెంకట్రావు నేతృత్వంలో గోపు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, కటకం బాలాజీ దంపతులు వేదపండితులు సుబ్రమణ్యంస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగంపర్తి గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాల స్వామి వార్షిక కళ్యాణం నిర్వహించారు.

'విద్యుత్ ప్రమాదాలు జరిగితే బాధ్యులు నుంచే పరిహారం'

పిఠాపురం, మార్చి 21: కరెంటు సరఫరాలో నిర్లక్ష్యం వలన వ్యక్తుల ప్రాణాలకు, పశు సంపదకు నష్టం జరిగితే బాధ్యులైన ఉద్యోగులు నుంచే బాధితులకు పరిహారం వసూలుచేసి చెల్లిస్తామని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. వేదిక సభ్యులు ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్‌లతో కలిసి ఆయన పిఠాపురం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్ద గల కార్యాలయంలో గురువారం వినియోగదారుల నుంచి ఆయన విద్యుత్ సంబంధిత అంశాలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ 2016 నుంచి ఇప్పటి వరకూ ఉమ్మడి అయిదు జిల్లాల పరిధిలో వినియోగదారులు నుంచి 7,868 ఫిర్యాదులు అందగా, ఇప్పటి వరకూ 7,757 పరిష్కరించినట్లు చెప్పారు. 111 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదులు అందిన 100 రోజుల్లోగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలా గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

'60లక్షల పని దినాలు కల్పించాం'

గొల్లప్రోలురూరల్, మార్చి 21: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ 60లక్షల పనిదినాలు కల్పించినట్లు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కోదండరాముని చెరువు, చినజగ్గంపేట గ్రామంలో కొత్తచెరువుల్లో పూడికతీత పనులను ఆమె గురువారం పరిశీలించారు. కూలీల మస్తరును తనిఖీ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 80లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, రైల్వే భూముల్లో ఎక్కువ ఆదాయం వచ్చే మొక్కలు పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఏపీవో కొండలరావు ఉన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని

వంతాడ గిరిజనుల ఆందోళన

ప్రత్తిపాడు, మార్చి 21: ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వంతాడ గిరిజనులు గురువారం ధర్నా నిర్వహించారు. వంతాడలోని మహిళలు, కూలీలు జాబ్‌కార్డులతో స్థానిక గంగాలమ్మ గుడిచెట్టువద్ద ఈ ఆందోళన కొనసాగించారు. ఉపాధి హామీ పనులు తమకు కేటాయించకపోవడంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గిరిజనులు వాపోయారు. తమ గ్రామస్థులకు ఉపాధి పనులు కల్పించడంలో ఈ.గోకవరం సర్పంచ్ అడ్డంకులు సృష్టిస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉపాధి పనులు కల్పించి న్యాయం చేయాలని గిరిజనులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.